క్లుప్తంగా

పత్తి క్వింటాకు రూ.7,521

కొండమల్లేపల్లి : మార్కెటింగ్ సీజన్ 2024–25 సంవత్సరానికి గాను పత్తికి మద్దతు ధర రూ.7,521గా ఉందని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండమల్లేపల్లి మండలంలో రెండు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 8శాతం నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు పత్తిని ఆరబెట్టుకొని తీసుకురావాలని కోరారు.

భిక్షంరెడ్డికి జానారెడ్డి పరామర్శ



భిక్షంరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి భిక్షంరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య యోగక్షేమాలను గురించి పెద్దిరెడ్డి బిక్షంరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణగౌడ్, పిల్లి ఆంజనేయులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ : ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దేవరకొండ డిపో ఆధ్వర్యంలో నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ –నాగార్జునసాగర్ –మాచర్ల రూట్లలో నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని ఆయన సూచించారు. నవంబర్ 1వ తేదీ నుంచి ప్రతి 15రోజులకు ఒకసారి లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు అందించను న్నట్లు పేర్కొన్నారు.

రైతు బీమాను అమలు చేయాలి



మాట్లాడుతున్న నారి ఐలయ్య

చింతపల్లి : ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వింజమూరులో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం జరుగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, అమృతాచారి, మండల కార్యదర్శి రాములు మండల కమిటీ సభ్యులు యాదయ్య, పోలోజు బ్రహ్మం, కదారి బాలయ్య, ఆరకంటి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ సంఘాల సమావేశం

మిర్యాలగూడ అర్బన్ : సమగ్ర కులగణనపై బుధవారం బీసీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించనున్న సమావేశాన్ని సంఘాల నాయకులు విజయవంతం చేయాలని కోరా రు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

మిర్యాలగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని దామరచర్ల బీఆర్ఎస్ మండల నాయకుడు ఆంగోతు హాతీరాం అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లలిత హాతీరాం తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ బహూకరణ

చందంపేట : మండలంలోని పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు టేబుల్ లేక ఇబ్బందిపడుతుంటంతో అశోక్ సేవా ట్రస్ట్ ద్వారా టేబుల్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా అశోక్ సేవా ట్రస్ట్ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా నిరుపేదలైన విద్యార్థుల చదువులకు తమవంతుగా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సామ్యానాయక్, ఉపాధ్యాయులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు



డీటీసీఎస్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని, పౌరసరఫరాల గోదాం నుంచి ఆయా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసే క్రమంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సివిల్ సప్లయ్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులోని గోదాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ నుంచి దేవరకొండకు వస్తున్న బియ్యం, గోదాం నుంచి రేషన్ దుకాణాలకు, సంక్షేమ వసతి గృహాలకు పంపిణీ చేస్తున్న బియ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాలకు పంపిణీ చేస్తున్న బియ్యం కార్డు దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ నుంచి పేదలకు నాణ్యమైన బియ్యాన్ని రేషన్ దుకాణాల నుండి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, మారుపాకుల సురేష్‌గౌడ్, డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, కిన్నెర హరికృష్ణ, తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1కోటి విలువైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, మారుపాకుల సురేష్‌గౌడ్, నల్లగాసు జాన్‌యాదవ్, పవన్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, జీవన్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, తదితరులున్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న భక్తులు

పెద్దవూర : ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకుని క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవర్చుకోవాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని నులకవారిగూడెం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలాధారులు నులక సిద్ధార్థరెడ్డి ఆహ్వానం మేరకు గ్రామానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నులక రమణారెడ్డి, కొట్టె రమేష్‌యాదవ్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీతో భూసారం పెరుగుతుంది



మాట్లాడుతున్న వెంకటేష్

పెద్దవూర : నానో టెక్నాలజీ ఎరువులతో భూమిలో భూసారం పెరుగుతుందని ఇఫ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో ఇఫ్కో ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులకు ఆర్థిక ఇబ్బందులను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ఖర్చులను తగ్గించే ప్రయత్నంలో నానో టెక్నాలజీని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కాగా ఇఫ్కో కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అరలీటరుకు రూ.600లు, యూరియా అరలీటర్‌కు రూ.240 ధరతో మార్కెట్‌లో అందుబాటులో ఉందని అన్నారు. ద్రవరూప యూరియాపై రూ.26(266–240), డీఏపీపై రూ.750(1350–600) వరకు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అరలీటరు నానో డీఏపీ, యూరియా డబ్బాలు 50 కిలోల బస్తాతో సమానం. ఎకరానికి అరలీటరు నానో డీఏపీ సరిపోతుంది. నానో యూరియా, డీఏపీతో రైతులకు పెట్టుబడి ఖర్చుతో పాటు రవాణా భారం తగ్గుతుందని పేర్కొన్నారు. తెగుళ్ల, క్రిమి సంహారక పురుగుల బెడద తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నులక రమణారెడ్డి, రైతు స్వయం కృషి ఎస్పీఓ డైరెక్టర్ కె.జానయ్య, ఉపేంద్రాచారి, ఏ.భాస్కర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ నిధులు విడుదల చేయాలని వినతి



సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏఓ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న టీజీఎస్ నాయకులు

మిర్యాలగూడ : రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రూ.265కోట్ల ట్రైకార్ సబ్సిడీ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏఓ శర్మకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 32,122 మంది లబ్ధిదారులకు రూ.265కోట్ల ట్రైకార్ సబ్సిడీ రుణాలను మంజూరు చేసి నూతన యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేయాలన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. జీఓ నంబర్ 49ను రద్దు చేయాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, రాహుల్, సైదానాయక్, శివతేజ్, శారద పాల్గొన్నారు.

దేవరకొండ ఆర్డీఓగా రమణారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి

దేవరకొండ : దేవరకొండ నూతన ఆర్డీఓగా రమణారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన శ్రీరాములు గోదావరిఖని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రమణారెడ్డి దేవరకొండ ఆర్డీఓగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్, కార్యాలయ అధికారులు,సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణలో పాలన అస్తవ్యస్తం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ : సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన రాహిత్యం వల్ల తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా మారిందని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో 163 యాక్ట్‌ను అమలు చేయడం చూస్తుంటే శాంతిభద్రతలు లోపించినట్లు అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం అభద్రత భావంతో ఉందని, మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారన్నారు. తమ హక్కుల సాధన కోసం పోరాడుతున్న స్పెషల్ పోలీసులను 39మందిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. హైడ్రా ధనికుల ఇళ్లను కూల్చకుండా పేదల ఇళ్లను మాత్రమే కూలుస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ చార్జీలను పెంచలేద న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచే యోచన ఉండడంతో గమనించిన బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాలతో చార్జీల పెంపు పట్ల ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు.

పీఆర్టీయూ టీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా సునీల్‌కుమార్



సునీల్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

గుర్రంపోడు : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించేందుకు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కోఆర్డినేటర్‌గా అద్దంకి సునీల్‌కుమార్‌ను, జిల్లా సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గా చిట్టిప్రోలు సదానందంలను నియమిస్తూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, మేకల జాన్‌రెడ్డిలు ఉత్తర్వులు జారీ చేశారు. గుర్రంపోడు మండలం పిట్టలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీల్‌కుమార్ పీఆర్టీయూ సంఘంలో కీలక నాయకుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులను ఓటర్లుగా నమోదు చేయించి సమన్వయంతో పనిచేస్తూ శ్రీపాల్‌రెడ్డి గెలుపులో ముందుంటానన్నారు. తనను నియమించినందుకు రాష్ట్ర, జిల్లా బాధ్యులు శ్రీపాల్‌రెడ్డి, భిక్షంగౌడ్, డీవీఎస్ ఫణికుమార్, జాన్‌రెడ్డి, శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో శవాలను పీక్కుతినే పరిస్థితులు వచ్చాయంటే ప్రభుత్వాల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను కార్పొరేట్లకు అప్పజెప్తూ పేదలపై ధరల భారాన్ని మోపుతోందన్నారు. రాబోయే కాలంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆగడాలను అరికట్టేందుకు ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, అయూబ్, సీతారాములు, వినోద్‌నాయక్, ఎండీ.అంజద్, రామ్మూర్తి, గోవర్దని పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఆపాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

మిర్యాలగూడ టౌన్ : కళాశాల సమయంలో ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తప్పని సరిగా విద్యార్థులుంటే బస్సులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్టీసీ డీఎం రాం మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌నాయక్, కుర్ర సైదానాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనునాయక్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, వెంకటేష్, నగేష్, ఉపేందర్, స్వామి తదితరులు ఉన్నారు.

బకాయిలు విడుదల చేసేంత వరకు పోరాడుతాం

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసేంతవరకు పోరాడుతామని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ముడావత్ జగన్‌నాయక్, కుర్ర సైదానాయక్‌లు అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయడంతో మెస్ చార్జీలను పెంచి విడుదల చేయాలని లేనట్లయితే ఆందోళనల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యూమన్, వీరన్న, సూర్య, వెంకటేష్, సర్దార్, జగన్, జగదీష్, పాల్గొన్నారు.

బీసీ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో ఈనెల 3న నిర్వహించే బీజీ గర్జన సభ విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, తమ్ముడబోయిన అర్జున్, జయరాజులు మాట్లాడుతూ ఈ గర్జనలో బీసీల భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీల బతుకులు మాత్రం మార డం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు సత్యనారాయణ, పున్నా రాములు, మురళియాదవ్, గోవిందు, బిక్షం, ఈశ్వరాచారి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొండమల్లేపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పొల్కంపల్లి గ్రామానికి చెందిన తుఫాన్ వాహన డ్రైవర్ బోదాసు శ్రీనివాస్ ఈనెల 19న గుండెపోటుతో మృతి చెందాడు. కాగా తుఫాన్ వాహనాల సంఘం, తోటి డ్రైవర్లు అంతా కలిసి సేకరించిన రూ.50వేలను ఆర్థికసాయంగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమా భిక్షపతి, సైదులు, శంకర్, మల్లేష్, బాల్‌సింగ్, ఈదయ్య, రమేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

క్యాట్ లెవల్-1లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



క్యాట్ లెవల్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

మిర్యాలగూడ : పట్టణంలోని కృష్ణమానస కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షల్లో క్యాట్ లెవల్ –1లో సత్తా చాటి 115మంది విద్యార్థులు క్యాట్ లెవల్ 2కు అర్హత సాధించినట్లు శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్యలు మంగళవారం తెలిపారు. 44 మంది విద్యార్థులు మ్యాట్‌లోను, 30 మంది విద్యార్థులు ప్యాట్‌లోను, 41 మందివిద్యార్థులు చాట్‌లోను అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలకు ఇలాంటి ఒలింపియాడ్ పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, నాగేందర్, సుజిత, ఉపేందర్, వీరయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

చింతపల్లి : టీఎస్ యూటీఎఫ్ చింతపల్లి మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సిలువేరు నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం ఆనంద్ బాబు, ఉపాధ్యక్షుడిగా బి.వెంకటేశం, ఎం స్వర్ణకుమారి కోశాధికారిగా ఇరికి స్వామి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా కె.మోహన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శేఖర్‌రెడ్డి, నల్ల నరసింహ, నరసింహ, కృష్ణారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ట్రస్మా పట్టణ, డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ట్రస్మా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) పట్టణ, డివిజన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్మా పట్టణ అధ్యక్షుడిగా బొడ్డుపల్లి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి శ్యాంసుందర్, కోశాధికారిగా పాశం శ్రీధర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ట్రస్మా డివిజన్ అధ్యక్షుడిగా కందాళ శ్రీనివాస్‌చారి, కార్యదర్శిగా కందిమళ్ల దామోదర్, కోశాధికారిగా సాలెం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా నాయకులు వంగాల నిరంజన్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు, కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ముక్కమాల రాంమోహన్, గాదె రవీందర్‌రెడ్డి, రాములు, పాలగాని సాయి శ్రీనివాస్ తదితరులున్నారు.

డీ 22 గేటు ధ్వంసం



మరమ్మతులు చేస్తున్న ఏఎమ్మార్పీ సిబ్బంది

గుర్రంపోడు : నీటి కోసం గేట్లు ఎత్తడం, ధర్నాలు చేసిన రైతులు ఇప్పుడేమో నీళ్లు వద్దంటూ కాల్వ గేట్లు బలవంతంగా మూసివేసే ప్రయత్నంలో రైతులు ధ్వంసం చేయడంతో కొత్త సమస్య వచ్చింది. డీ 22 పరిధిలోని కాల్వ మొదట్లోని రైతులు వరికోతలకు మిషన్‌లు పొలాల్లో దిగడం లేదని నీరు అవసరం లేని రైతులు తమ పొలాలకు నీరు రాకుండా అడ్డుకట్ట వేసుకునే బదులు సోమవారం రాత్రి బలవంతంగా ట్రాక్టర్లతో గేటును రాత్రి వేళ దించడంతో ధ్వంసమైంది. గతేడాది లక్షన్నర ఖర్చుతో కొత్త గేటును బిగించగా ఇప్పుడు మళ్లీ గేటు దెబ్బతింది. తమ పొలాలకు నీళ్లు కావాలని ఆలస్యంగా నాట్లు వేసుకున రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఏఎమ్మార్పీ అధికారులు ఎంతో కష్టపడి చైన్‌బ్లాక్‌ల సాయంతో గేటు ఎత్తారు. ఇప్పుడు గేటు సజావుగా పైకి కిందకు కదలలేని పరిస్థితి ఉందంటున్నారు. రైతులు ఎవరూ గేట్ల జోలికి పోవద్దని, నీరు అవసరం లేని రైతులు తమ పొలాల వద్ద అడ్డుకట్టలు వేసుకోవాలని ఏఎమ్మార్పీ ఈఈ ఆనందరావు, ఏఈ శ్రీనివాస్‌రావులు రైతులను కోరారు.

నల్లగొండ జిల్లా జట్టు విజయం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సభ్యులు

మిర్యాలగూడ అర్బన్ : ది తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ క్లియో స్పోర్ట్స్‌లో నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్స్ వన్డే లీగ్ టోర్నమెంట్ కొనసాగుతుంది. మంగళవారం నల్లగొండ–అచ్చంపేట జట్ల మధ్య నల్లగొండ జట్టు ఘనవిజం సాధించినట్లు జిల్లా కోచ్ కావలి వెంకన్న తెలిపారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన అచ్చంపేట జట్టు 13.2 ఓవర్లలో 61 పరుగులకే ఆలౌట్ కాగా 7.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా నల్లగొండ జట్టు లక్ష్యాన్ని ఛేదించింది. టోర్నమెంట్ లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా జట్లతో మ్యాచ్‌లు ఆడాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ముజాఫర్, సాయికృష్ణ, శంకర్, రాజు, నాయుడు ఉన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి



ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయీ బ్రాహ్మణులు

మిర్యాలగూడ టౌన్ : నాయీ బ్రాహ్మణులందరూ కలిసిమెలిసి ఉండటంతో పాటు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి అలగడప గిరిధర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందర్‌నగర్‌లో గల నాయీ బ్రాహ్మణ సంఘం భవనంలో ధన్వంతరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణుల కులదైవం వేడుకలను ప్రతి ఇంటిలో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, స్వామి, వెంకట్, వెంకటయ్య, నర్సింహ, వెంకన్న, శ్రీకాంత్, సత్యనారాయణ, నగేష్, వీరయ్య, కిట్టు, కిరణ్, సైదులు, లింగయ్య, పాండులతో పాటు పలువురు నాయకులు తదితరులున్నారు.

పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవు



ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వీరశేఖర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వీర శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలో పరిమితికి మంచి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు జరిమానా విధించారు. అనంతరం ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు నిషేధమని సౌండ్ బాక్స్‌లతో నడపరాదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన పాలకూరి లక్ష్మమ్మకు రూ.14వేలు, వల్లమల్ల బాలయ్యకు రూ.44వేల మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పేరెల్లి నగేష్ లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని, పేదలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రెమడాల కరుణాకర్, బొడ్డు జానకిరాములు, బొమ్మగాని మంగమ్మ, లింగయ్య, గోపాల్, సైదులు, నాగయ్య, వెంకన్న, లక్ష్మయ్య, మిన్నయ్య, మస్తాన్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న నగేశ్